సాక్షి పల్నాడు

శనివారం, 30, డిసెంబర్, 2023



క్యాలెండర్ ఆవిష్కరణ

గుంటూరురూరల్: రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖ క్యాలెండర్‌ను ఆ శాఖ ఐజీ రామకృష్ణ శుక్రవారం గుంటూరులో ఆవిష్కరించారు. అడిషనల్ ఐజీ ఉదయభాస్కర్ పాల్గొన్నారు.



న్యాయమూర్తి తనిఖీలు

గుంటూరుమెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలోని లీగల్ సర్వీసెస్ క్లినిక్‌ను శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి టి.లీలావతి తనిఖీ చేశారు.



దుర్గమ్మ సేవలో..

విజయవాడ: ఉప ముఖ్యమంత్రి కె.నారాయణ స్వామి శుక్రవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

నేడు తాడికొండలో సామాజిక సాధికార యాత్ర



తాడికొండ బస్టాండ్ కూడలిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అయోధ్య, మర్రి, సుచరిత

తాడికొండ: తాడికొండలో శనివారం వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత చెప్పారు. శుక్రవారం తాడికొండ బస్టాండ్ సెంటర్‌లో సామాజిక సాధికార యాత్రలో భాగంగా బహిరంగ సభ ఏర్పాటు చేసే ప్రాంతాన్ని వారు పరిశీలించారు. ఏర్పాట్లపై చర్చించారు. సభకు భారీగా ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో వసతుల కల్పనపై చర్చించారు. శనివారం సాయంత్రం 3 గంటలకు తాడికొండ అడ్డరోడ్డుకు నాయకులు కార్యకర్తలతో చేరుకుని కలిసి విలేకరుల సమావేశం నిర్వహించిన అనంతరం అడ్డరోడ్డు నుంచి ర్యాలీగా బయలుదేరి తాడికొండ ప్రారంభం నుంచి పాదయాత్రగా బహిరంగ సభా ప్రాంతానికి చేరుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే, పార్టీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత మాట్లాడుతూ సాధికార యాత్రను ప్రజలు, పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మచిలీపట్నం పోర్టు ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్, ఏపీ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నలుగురు సీఐల బదిలీ

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు రేంజ్ పరిధిలో నలుగురు సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. బాపట్ల రూరల్ సర్కిల్ సీఐ జి.వేణుగోపాలరెడ్డిని గూడూరు రూరల్ సర్కిల్‌కు, గూడూరు రూరల్ సర్కిల్ సీఐ జి.దశరథరామయ్యను రేంజ్ వీఆర్‌కు, రేంజ్ వీఆర్‌లో ఉన్న కొండవీటి శ్రీనివాసరావును కావలి టూ టౌన్ యూపీఎస్, ఎస్పీఎస్‌కు, కావలి టూ టౌన్ యూపీఎస్, ఎస్పీఎస్ సీఐగా పనిచేస్తున్న ఎ.సుధాకర్‌ను రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు.

జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ



జగనన్న విద్యాజ్యోతి స్టడీమెటీరియల్‌ను పరిశీలిస్తున్న డీవైఈవో వెంకటేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థుల కోసం జెడ్పీ ఆధ్వర్యంలో ముద్రించిన జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను గుంటూరు డివిజన్ పరిధిలోని పాఠశాలలకు శనివారం పంపిణీ చేయనున్నారు. పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్షా భవన్‌లో శనివారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. దీనివల్ల డివిజన్ పరిధిలోని 107 పాఠశాలల్లో 7,700 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం జిల్లా పరీక్షా భవన్‌లో భద్రపరిచిన విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పుస్తకాలను శుక్రవారం గుంటూరు డీవైఈవో పి.వెంకటేశ్వరరావు పరిశీలించారు. శనివారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహ్మద్ ముస్తఫా అధ్యక్షతన జరగనున్న కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పుస్తకాలను అందజేస్తామని చెప్పారు.

ఎస్ఈబీ ఏఎస్పీగా వెంకటేశ్వరరావు

నగరంపాలెం: గుంటూరు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ–సెబ్) అదనపు ఎస్పీ (ఏఎస్పీ)గా మొగలి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా పలువురు డీఎస్పీలకు అదనపు ఎస్పీ (ఏఎస్పీ)లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ క్రమంలో కాకినాడ ఎస్బీ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరావుకి ఏఎస్పీగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ, వెంటనే గుంటూరు జిల్లా ఎస్ఈబీ ఏఎస్పీగా నియమించారు. గతంలో ఏఎస్పీగా విధులు నిర్వర్తించిన డీఎన్. మహేష్‌కు నాన్ కేడర్ (ఎన్‌సీ) ఎస్పీగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ, విజయవాడ ఏసీబీ ఎస్పీగా బదిలీ చేసిన విషయం విదితమే. బాపట్ల జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఏవీ.రమణకు ఏఎస్పీగా ఉద్యోగోన్నతి కల్పించగా, ఆయన్ను ఇంటిలిజెన్స్ ఏఎస్పీగా నియమితులయ్యారు.

‘నేర’వేరిన నియంత్రణ



మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, చిత్రంలో అదనపు ఎస్పీలు చంద్రశేఖర్, రామచంద్రరాజు

నేరాలు తగ్గుముఖం

- అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం
- సాంకేతిక పరిజ్ఞానంతో కేసుల ఛేదన
- 62 శాతం తగ్గిన మహిళలపై నేరాలు
- రోడ్డు ప్రమాదాల్లో 23 శాతం తగ్గుదల
- వార్షిక నేర సమీక్షలో ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

సాక్షి, నరసరావుపేట : శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో పల్నాడు పోలీసులు ఈ ఏడాది పురోగతి సాధించారు. ఆపత్కాలంలో ప్రజలకు అండగా నిలిచి ధైర్యం చెప్పారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా మమేకమయ్యారు. కొత్త జిల్లా కేంద్రంలో ఒకవైపు ఒక్కొక్కటిగా మౌలిక వసతులను కల్పించుకుంటూనే, మరోవైపు మెరుగైన పోలీసింగ్ ద్వారా ప్రజల మనస్సులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ వై.రవిశంకర్‌రెడి శుక్రవారం నేర సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది కేసులు బాగా తగ్గుముఖం పట్టాయని చెప్పారు. సమావేశంలో అదనపు ఎస్పీలు చంద్రశేఖర్, రామచంద్రరాజు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్పీ చెప్పిన వివరాల్లో ముఖ్యాంశాలు

- గత ఏడాదితో పోలిస్తే మహిళలపై నేరాలు 62 శాతం తగ్గాయి.
- ఈ ఏడాది హత్య కేసులు 41 నమోదయ్యాయి. ఈ సంఖ్య 2021లో 40 కాగా, గతేడాది 37గా ఉంది.
- రోడ్డు ప్రమాదాలు 23 శాతం తగ్గాయి. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రుల సంఖ్య 29 శాతం తగ్గింది. జాతీయ, రాష్ట్ర, అంతర్గత రహదారుల్లో తీసుకున్న చర్యల వల్ల ఇది సాధ్యమైంది.
- ఎస్సీ, ఎస్టీ కేసుల్లోనూ 38.3 శాతం తగ్గుదల కనిపించింది.
- చోరీ కేసుల్లో రికవరీ పెరిగింది. 2021లో రికవరీ శాతం 55.44 శాతం ఉండగా, 2022లో 67.8 శాతంగా, ఈ ఏడాది 88.7 శాతంగా నమోదైంది. ఈ ఏడాది 340 కేసుల్లో రూ.4,33,15,957 విలువైన సొత్తు చోరీకి గురికాగా, ఇప్పటికే రూ.3,62,55,456 విలువైన సొత్తు రికవరీ అయింది.
- సైబర్ నేరాలు గతేడాది 27 నమోదు కాగా, ఈ ఏడాది 19 మాత్రమే రికార్డయ్యాయి. ప్రజలకు సైబర్ నేరాలు, రుణయాప్‌లపై అవగాహన కల్పించడం వల్ల ఇది సాధ్యమైంది.
- గుట్కా, జూదం, క్రికెట్ బెట్టింగ్, సారాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు.
- పోక్సో చట్టం కేసులూ 65.4 శాతం తగ్గాయి.
- సమస్యాత్మక గ్రామాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు.
- ఫ్యాక్షన్ గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేశారు.
- నిఘా బృందాలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి, పటిష్ట చర్యలు తీసుకున్నారు.

గత మూడేళ్లలో కేసులు ఇలా..

సంవత్సరం	కేసులు
2021	6,365
2022	4,712
2023	4,546

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం ఇలా..

సంవత్సరం	పరిష్కారమైన కేసులు
2021	1,417
2022	2,690
2023	5,683

చిన్నారులు, మహిళలపై నేరాల కేసులు

సంవత్సరం	మహిళలపై నేరాల కేసులు	పోక్సో చట్టం కేసులు
2021	975	86
2022	713	81
2023	268	28

ఆణిముత్యాల గుర్తింపునకే ‘ఆడుదాం ఆంధ్రా’



బ్యాటింగ్ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లిలో ఉత్సాహంగా ‘ఆడుదాం–ఆంధ్రా’ క్రీడా పోటీలు

సత్తెనపల్లి: క్రీడా ఆణిముత్యాల గుర్తింపునకే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ‘ఆడుదాం–ఆంధ్రా’ పోటీలను నిర్వహిస్తోందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ‘ఆడుదాం–ఆంధ్రా’లో భాగంగా క్రికెట్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించి బ్యాటింగ్, బౌలింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి వారిని మరింత ప్రోత్సహించేలా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలను గ్రామ/ వార్డు సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. పట్టణంలోని 10, 11, 12వ సచివాలయాల పరిధిలో టీమ్‌లకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ కూడా కాసేపు బ్యాటింగ్, బౌలింగ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, పార్టీ నాయకులు బండి మల్లికార్జునరెడ్డి, లోక మాధవ, అవ్వారు శ్రీనివాసరావు, పీడీలు, పీఈటీలు, నోడల్ అధికారులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.



నందిగామలో జరిగిన కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

21 పరుగులు చేశా



‘ఆడుదాం–ఆంధ్రా’లో భాగంగా క్రికెట్ పోటీల్లో ఆడేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నా. మా జట్టులో అత్యధిక పరుగులు చేయగలిగే అవకాశం లభించింది. 21 పరుగులు చేశా. జట్టు విజయానికి కృషి చేశా.

– గొల్లపల్లి అజయ్, క్రీడాకారుడు, సత్తెనపల్లి

ప్రతిభ చూపే అవకాశం



ఆటల్లో ప్రతిభ ఆవకాశం ‘ఆడుదాం–ఆంధ్రా’ క్రీడా పోటీల వల్ల లభించింది. గెలుపే లక్ష్యంగా క్రికెట్ పోటీల్లో తలపడ్డాం. నేను అత్యధికంగా మూడు వికెట్లు తీసే అవకాశం వచ్చింది. ఇదే స్ఫూర్తితో మరింత తర్ఫీదు పొందితే రాణించగలననే ఆత్మవిశ్వాసం కలిగింది.

శిలివేరి చందు, క్రీడాకారుడు, సత్తెనపల్లి

33,159 మందికి జగనన్న విద్యా దీవెన



విద్యార్థులకు నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

రూ.26.64 కోట్ల మేర లబ్ధి

నరసరావుపేట: జిల్లాలో జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా ఈ ఏడాది జూలై–సెప్టెంబర్ త్రైమాసికానికి సంబంధించి 33,159 మంది విద్యార్థులకు రూ.26.64 కోట్ల మేర లబ్ధి చేకూరింది. శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి తల్లులు, విద్యార్థుల జాయింట్ ఖాతాల్లో నేరుగా నగదు జమ చేశారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలు నుంచి ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టర్ శివశంకర్ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు మెగా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ ఓబులనాయుడు, డీటీడబ్ల్యూఓ వరలక్ష్మి పాల్గొన్నారు.

పెండింగ్ ఓటర్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

కలెక్టర్ లోతేటి శివశంకర్



కలెక్టరేట్ నుంచి సమీక్షలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్

నరసరావుపేట: పెండింగ్ ఓటరు దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి హాజరయ్యారు. డ్రాఫ్ట్ ప్రచురణ రోజున అప్లికేషన్ స్థితి, ఎస్ఎస్ఆర్–2024లో ఈనెల 9నాటి వరకు స్వీకరించిన ఫారమ్‌లు, పీఎస్ఈలు, డీఎస్ఈల డిస్పోజల్ స్థితి, అనోమలిస్ పెండింగ్, పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలు తదితర అంశాలపై కలెక్టర్లతో చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ ఉన్న ఫామ్ 6, 7, 8 దరఖాస్తులను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అక్టోబర్ 27 నుంచి నవంబర్ 9 వరకు ఫామ్ 6,7,8కి సంబంధించి పెండింగ్ దరఖాస్తులను, వాటికి సంబంధించి టెక్నికల్ సమస్య ఉన్న వాటిని ఎన్నికల కమిషన్‌కు రిపోర్ట్ చేశామని పేర్కొన్నారు. పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరిస్తామన్నారు. 10 దరఖాస్తులకు సంబంధించి ఉన్నవి మూడు రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే పెండింగ్ ఉన్న పీఎస్ఈలు, డీఎస్ఈలను కూడా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు త్వరలో నియమించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఎన్నికల కోసం అవసరమైన పీఓ, ఏపీఓ, ఓపీఓలను గుర్తిస్తున్నామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాదు, ఆర్డీవోలు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్, ఎలక్షన్ డీటీలు పాల్గొన్నారు.

47,192 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 45,336 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 47,192 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.22,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 24,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 23,300 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 25,990 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు.

తీవ్ర విషాదం

- జ్యూయలరీ వ్యాపారి కుటుంబం ఆత్మహత్య
- ఆర్థిక ఇబ్బందులు భరించలేకే!
- సైనైడ్ కలిపిన బిర్యానీ తిని బలవన్మరణానికి యత్నం
- భార్యాభర్తలు, ఇద్దరు కుమార్తెలు మృతి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మూడో కుమార్తె
- కుటుంబం స్వస్థలం తెనాలి
- అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్న అనకాపల్లి పోలీసులు



శివరామకృష్ణ కుటుంబం (ఫైల్)



విగత జీవులుగా శివరామకృష్ణ కుటుంబం

సాక్షి, అనకాపల్లి: పట్టణంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అప్పుల బాధ తాళలేక జ్యూయలరీ వ్యాపారి కుటుంబ సభ్యులతో సహా ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బిర్యానీలో సైనైడ్ కలిపి భార్య, ముగ్గురు పిల్లలతో తినిపించి బలవన్మరణానికి యత్నించాడు. ఈ హృదయవిదారక ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వీరిలో నలుగురు మృతి చెందగా.. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన జ్యూయలరీ వ్యాపారి కొడవలి శివరామకృష్ణ తన కుటుంబంతో ఏడాది క్రితం అనకాపల్లికి వచ్చారు. అనకాపల్లి టౌన్‌లో పెరుగుబజారు సమీపంలో జ్యూయిలరీ షాపును ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేసుకుంటున్నారు. ఆర్థిక ఇబ్బందులతో స్వస్థలాన్ని వీడిన రామకృష్ణ స్థానిక ఉడ్ పేటలో ఫైర్ స్టేషన్ పక్కన లక్ష్మీ ప్యారడైజ్ అపార్ట్‌మెంట్‌లో భార్య మాధవి దేవి (40), కుమార్తెలు వైష్ణవి (15), జాహ్నవి (12), కుసుమప్రియతో కలిసి నివాసముంటున్నారు. తన పిల్లలను స్థానిక సిటీ పబ్లిక్ స్కూల్లో చదివిస్తున్నారు. పిల్లలు తొమ్మిది, ఏడు, మూడు తరగతులు చదువుతున్నారు. అనకాపల్లికి వచ్చిన ప్రారంభంలో రామకృష్ణ ఓ బంగారం షాపులో ఉద్యోగం చేసేవాడు. ఆ తరువాత సొంతంగా జ్యూయలరీ షాపు పెట్టుకున్నాడు. ఏడాదిన్నర నుంచి అనకాపల్లి టౌన్‌లోనే ఉన్నా వ్యాపారరీత్యాగానీ, పని నిమిత్తంగానీ ఎవరితోనూ వివాదం పెట్టుకున్న సందర్భాలు లేవు. అయితే ఆ కుటుంబం చుట్టుపక్కల వారితో కలివిడిగా ఉండేవారు కాదని, ముభావంగా అంటీముట్టనట్టు ఒంటరిగా ఉండేవారని స్థానికులు తెలిపారు.

భార్యాపిల్లలకు తెలీకుండా!

రామకృష్ణ గురువారం రాత్రి 9 గంటలకు దుకాణం నుంచి ఇంటికి వచ్చాడు. సైనైడ్ కలిపిన బిర్యానీ తీసుకొచ్చాడు. ఆ విషయం భార్యాపిల్లలకు తెలీదు. కుటుంబమంతా బిర్యానీ తిన్నారు. అంతలో చిన్న కూతురు కుసుమ వాంతి చేసుకుంది. కొద్ది క్షణాల్లోనే మిగతావారంతా నేలకొరిగారు. ఈ విషయం గమనించిన కుసుమ పక్కింటికి వెళ్లి అమ్మ, నాన్న నిద్రపోయి లేవలేదు అని ఏడుస్తూ చెప్పింది. వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వాంతులు చేసుకున్న చిన్నారిని హుటాహుటిన స్థానిక ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. అనంతరం కేజీహెచ్‌కు తరలించారు.

మూడేళ్లుగా దూరం

రామకృష్ణ అప్పులు చేసి ఎవరికీ తెలియకుండా అనకాపల్లి టౌన్‌లో నివసిస్తున్నట్టు అనకాపల్లి చేరుకున్న అతని సోదరుడు వెంకటేశ్వరరావు చెప్పిన వివరాల ప్రకారం తెలుస్తోంది. సుమారుగా మూడేళ్లుగా కుటుంబ సభ్యులతో సఖ్యత లేదని తెలుస్తోంది. మృతదేహాలను చూసేందుకు ఒక సోదరుడు మినహా కుటుంబ సభ్యులు ఎవరూ రాలేదు.

ఆధారాలు లేవు

ఘటన స్థలంలో ఆత్మహత్యకు సంబంధించిన ఎటువంటి ఆధారాలూ లభించలేదని డీఎస్పీ వి.సుబ్బరాజు చెప్పారు. క్లూస్‌టీమ్ ఇంటిలో అన్ని గదులనూ క్షుణ్ణంగా పరిశీలించిందని పేర్కొన్నారు. బిర్యానీ ప్యాకెట్లతో భోజనం చేస్తూ అక్కడికక్కడే నలుగురు మృతి చెందగా, కుసుమప్రియ అపాయం నుంచి తప్పించుకుందని, ప్రస్తుతం కేజీహెచ్‌లో కోలుకుంటోందన్నారు. శివరామకృష్ణ అన్నయ్య వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దాడి మోహనరావు చెప్పారు.

వైఎస్సార్ అవార్డు‘నంది’ంచె



గుంటూరు వేంకటేశ్వర విజ్ఞాన కేంద్రంలో రాష్ట్రస్థాయి నంది నాటకోత్సవాలు శుక్రవారం ముగిశాయి. కాకినాడ యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ నిర్వాహకునికి వైఎస్సార్ అవార్డును అందిస్తున్న రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు, సినీ, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి తదితరులు

– పాతగుంటూరు

సంక్షేమ సం‘కల్పతరువు’



వికసిత్ భారత్– సంకల్ప యాత్ర శుక్రవారం పొన్నూరు మండలం మామిళ్లపల్లిలో అట్టహాసంగా జరిగింది. కార్యక్రమంలో కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవియా, రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు.

– పొన్నూరు

క్లుప్తంగా

టెన్త్, ఇంటర్ దూరవిద్య పరీక్షల తేదీలు ఖరారు

డీఈఓ శామ్యూల్



నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (దూర విద్య) ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు 2024 మార్చి 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకు నిర్వహించేందుకు విద్యాపీఠం సంచాలకులు ఉత్తర్వులు జారీ చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి కె. శామ్యూల్ శుక్రవారం తెలిపారు. ఆయా తేదీలలో ప్రతి రోజూ మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. అలాగే ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు మార్చి 30వ తేదీ నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు రెండు పూటలా జరుగుతాయని వివరించారు. అభ్యాసకులు తమ పరీక్ష ఫీజును జనవరి 5వ తేదీ నుంచి ఫిబ్రవరి 9వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని తెలిపారు. అపరాధ రుసుముతో ఫిబ్రవరి 3వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. అలాగే ఫిబ్రవరి 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఇంటర్మీడియట్‌కు రూ.1000, 10వ తరగతికి రూ.500లు తత్కాల్ ఫీజు చెల్లించి పరీక్ష రాయవచ్చని తెలిపారు. వివరాలకు www.apopenrchoo.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవాలని సూచించారు.

10వ తరగతి ఫీజు చెల్లింపునకు తత్కాల్ గడువు

2024 మార్చి నెలలో జరుగనున్న పదవ తరగతి పబ్లిక్, సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే రెగ్యులర్ విద్యార్థులు జనవరి 2వ తేదీ వరకు రూ.500ల ఆలస్య రుసుముతో తత్కాల్ ఫీజు చెల్లించి పరీక్షకు హాజరు కావాలని డీఈఓ శామ్యూల్ తెలిపారు. ఫీజు చెల్లించి పరీక్షకు హాజరైన వారికి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ రాసేందుకు వీలుంటుందని తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ లాగిన్ ఐడీ ద్వారా ఫీజులు చెల్లించాలని సూచించారు.



సాంఘిక నాటకం విభాగంలో ప్రథమ బహుమతి 'ఇంద్రప్రస్థం' (గుంటూరు)



సాంఘిక నాటిక ప్రథమ బహుమతి 'ఆస్తికలు' (గుంటూరు)..



పద్య నాటకంలో ప్రథమ బహుమతి 'శ్రీమాధవ వర్మ' (విజయవాడ)



బాలల నాటిక ప్రథమ బహుమతి 'ప్రపంచతంత్రం' (విజయవాడ)

'నంది' అవార్డుల ప్రదానం

నంది నాటకోత్సవం శుక్రవారం ముగిసింది. గుంటూరు వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వారం రోజులు పాటు నిర్వహించిన వేడుకలో కళాకారులు అత్యుత్తమ ప్రదర్శనలిచ్చారు. ప్రభుత్వం తరపున సాంఘిక నాటిక, నాటకం, పద్య నాటకం, బాలల నాటిక విజేతలకు స్వర్ణనందులు అందజేశారు.

–పాతగుంటూరు



యూనివర్సిటీ కాలేజీ నాటిక ప్రథమ బహుమతి 'ఇంకానా' (విజయవాడ)

చిరుమామిళ్ల 'శ్రీమంతుడు' రామిరెడ్డి

- పుట్టిన గ్రామాన్ని చక్కగా అభివృద్ధి చేసుకున్నారు
- నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, కలెక్టర్ శివశంకర్, నడికట్టు రామిరెడ్డి

నాదెండ్ల: తాను పుట్టిన గ్రామాన్ని ఎంత గొప్పగా అభివృద్ధి చేసుకోవచ్చో చూపిన శ్రీమంతుడు సినిమాకు మించి స్వగ్రామాన్ని అభివృద్ధి చేసుకున్న శ్రీమంతుడు నడికట్టు రామిరెడ్డి అని నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చెప్పారు. చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నడికట్టు రామిరెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌తో కలిసి ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గోపిరెడ్డి మాట్లాడుతూ పట్టణాల్లో కూడా లేని వసతులను గ్రామంలో కల్పించి రాష్ట్రంలోనే మోడల్ విలేజ్‌గా చిరుమామిళ్ళను నింపిన ఘనత రామిరెడ్డిదేనన్నారు. గ్రామంలో రూ.5.50 కోట్ల వ్యయంతో 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి మూడెకరాల భూమిని విరాళంగా ఇచ్చారని, ప్రస్తుతం ఇది నాబార్డ్ టెండర్ దశలో ఉందన్నారు. రామిరెడ్డి అనంతరం ఆయన వారసులు గ్రామ అభివృద్ధి బాధ్యతలు తీసుకునేందుకు ముందుకు రావాలని ఆకాంక్షించారు.

యువతకు శిక్షణతో నైపుణ్యాభివృద్ధి

జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ మాట్లాడుతూ, రామిరెడ్డి ఎప్పటి నుంచో గ్రామంలో పాఠశాలల అభివృద్ధికి కృషి చేసి ఉన్నతంగా నిలిపారన్నారు. 9, 10 తరగతుల్లో చురుగ్గా ఉండే విద్యార్థులను ఎంపిక చేసి దేశరాజధాని ఢిల్లీ తదితర నగరాలకు విజ్ఞాన యాత్రకు తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేయాలని రామిరెడ్డిని కోరారు. నడికట్టు రామిరెడ్డి మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు అవసరమైన భూమిని ఇచ్చి భవనం కట్టించి ఇస్తానని, అందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు ఇవ్వాలని కోరారు. తన తదనంతరం గ్రామంలో అభివృద్ధి పనులు ఆగకుండా వారసులను ఎంపిక చేస్తానని చెప్పారు. తాను పుట్టిన గ్రామానికి ఎప్పుడూ రుణపడి ఉంటానని వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ సింగారెడ్డి లక్ష్మి, తహసీల్దార్ నాంపల్లి నాగ మల్లేశ్వర రావు, ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, నాదెండ్ల సొసైటీ మాజీ చైర్మన్ సింగారెడ్డి కోటిరెడ్డి, కొండవీడు అభివృద్ధి సమితి చైర్మన్ కల్లి శివారెడ్డి, ఏపీపీ బాల హనుమంతరెడ్డి, హెచ్‌ఎంలు శ్రీనివాసరావు, కరిముల్లా పాల్గొన్నారు.

మిరపసాగులో పల్నాడు ప్రసిద్ధి

- రైతులు జిల్లా ప్రాధాన్యతను కాపాడాలి
- మిరపలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ, అవగాహన
- సూచనలు చేసిన జిల్లా కలెక్టర్, శాస్త్రవేత్తలు



మిరప పంట సాగుపై బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, ఉద్యాన అధికారులు, శాస్త్రవేత్తలు

నరసరావుపేట: పల్నాడు జిల్లా మిరప సాగుకు ప్రసిద్ధిని కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ అతిథి గృహంలో శుక్రవారం స్పైసెస్ బోర్డు, జిల్లా ఉద్యానశాఖ సారథ్యంలో రైతులకు మిరప పంట సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి బీజే బెన్నీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై ప్రసంగించారు.

జిల్లాలో మిరపసాగు పరిరక్షించాల్సిన బాధ్యత శాస్త్రవేత్తలు, అధికారులపైనే ఉందని, సేంద్రియ విధానం ద్వారా పండించే మిరప పంట ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్ అధికంగా ఉన్నందున ఎగుమతులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. దీంతో సేంద్రీయ విధానాన్ని ఎక్కువమంది రైతులు అనుసరించేలా అధికారులు కృషి చేయాలన్నారు. గుంటూరు అదనపు ఉద్యాన సంచాలకులు ఎస్.వెంకటేశ్వర్లు, ఓ.బాలాజీనాయక్ మాట్లాడుతూ మిరప పంటను విదేశాలకు ఎగుమతి చేసే పద్ధతులు, సేంద్రియ పద్ధతిలో మిరప సాగు, పురుగు మందుల అవశేషాల గురించి వివరించారు. గుంటూరు డీడీహెచ్ వి.ధర్మజ మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఆవశ్యకత, ప్రభుత్వం నుంచి అందుతున్న రాయితీలు వివరించారు.

గుంటూరు స్పైసెస్ బోర్డు డీడీ అనన్ దెబ్బర్మ మాట్లాడుతూ మిరపలో పురుగుమందుల అవశేషాలు గుర్తించడం, మంచి నాణ్యమైన మిరప పంటను ఎగుమతులు, స్పైసెస్ బోర్డు అందిస్తున్న రాయితీలు, గుంటూరు నాబార్డు డీడీఎం శరత్ కుమార్ నాబార్డ్ నుంచి రైతులు, రైతు సంఘాలకు వర్తించే రాయితీలు, వివిధ పథకాలకు ఇచ్చే రుణాలు వివరించారు. రైతు శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఉద్యాన పరిశోధనా కేంద్ర లాంఫాం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఓ.శిరీష మాట్లాడుతూ మిరపలో ప్రస్తుత కాలంలో ఆశించే చీడపీడలు, వాటి నివారణ చర్యలు వివరించారు. జిల్లా ఉద్యాన అధికారి బెన్నీ మాట్లాడుతూ తమ శాఖలో అమలవుతున్న పథకాలు, రాయితీలను గురించి వివరించారు. చిలకలూరిపేట, గురజాల, నరసరావుపేట, వినుకొండ, మాచర్ల ఉద్యానశాఖ అధికారులు ఎన్.కిషోర్ కుమార్, వై.మోహన్, డి.నవీన్ కుమార్, షేక్. నబి రసూల్, ఎన్.సురేష్ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ విజేత మాచవరం ఉపాధ్యాయుడు



బహుమతి అందుకుంటున్న అంకమయ్య

మాచవరం: కడప నగరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో మాచవరం జెడ్పీ స్కూల్‌కు చెందిన సైన్స్ జీవశాస్త్ర ఉపాధ్యాయుడు దావల అంకమయ్య అత్యుత్తమ ప్రతిభను చూపి విజేతగా నిలిచారు. ఇటీవల జిల్లా కేంద్రమైన నర్సరావుపేటలో నిర్వహించిన పల్నాడు జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఉపాధ్యాయ విభాగంలో అంకమయ్య తయారు చేసిన ఆధునిక వీధి దీప స్తంభాలు ప్రాజెక్టుకు జిల్లాస్థాయిలో విజేతగా నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలోనూ విజేతగా నిలిచి, జాతీయ స్థాయిలో జరిగే సదరన్ ఇండియా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యారు. ప్రాజెక్టు వలన కలిగే బహుళ ప్రయోజనాలను ఆయన కమిటీకి వివరించారు. రాష్ట్ర స్థాయిలో బహుమతి పొంది, జాతీయ స్థాయికి ఎంపికైన ఉపాధ్యాయుడు అంకమయ్యకు ఎస్‌సీఈఆర్‌డీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, కడప జిల్లా విద్యాశాఖధికారి రాఘవరెడ్డిలు మెమొంటోను, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. విజేతగా నిలిచిన అంకమయ్యను పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి పి. శామ్యూల్, ఉప విద్యాశాఖాదికారి, సైన్స్ ఆఫీసర్ ఎ.మధుకుమార్, హెచ్‌ఎం సురేష్ బాబు, పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

హృద్రోగ బాధితులకు అండగా బజరంగ్



విజయవాడ మెడ్‌స్టార్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవడానికి వచ్చిన తక్కెళ్లపాడు గ్రామస్తులతో అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: హృద్రోగ బాధితులకు బజరంగ్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ అండగా నిలిచి వైద్యసేవలు అందిస్తున్నారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బజరంగ్ సంక్షేమ సంగమం కార్యక్రమాన్ని ఈనెల 27న తక్కెళ్లపాడులో నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన 'మీ గుండె పదిలం' శిబిరంలో యాంజియోగ్రామ్ పరీక్ష అవసరమైన 26 మందిని గుర్తించారు. వారిలో తొలి విడతగా 13 మందిని ప్రత్యేక బస్సులో విజయవాడ మెడ్ స్టార్ ఆస్పత్రికి తరలించారు.

ఆస్పత్రిలో అత్యాధునిక పరికరాలతో నిర్వహించిన యాంజియోగ్రామ్ పరీక్షలో పది మందికి ఆరోగ్యస్థితి మెరుగ్గానే ఉందని, ఇద్దరికి స్టంట్లు వేయాలని, ఒకరికి బైపాస్ సర్జరీ చేయాలని డాక్టర్లు నిర్ధారించారు. చికిత్స పొందుతున్న వారందరినీ బజరంగ్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద వయస్సులో ఉన్న వారంతా ఏటా క్రమం తప్పకుండా ఒకసారి గుండె సంబంధిత పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా 'మీ గుండె పదిలం' నినాదంతో చేపట్టిన వైద్య శిబిరాలు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని తెలిపారు. గుండె సమస్య ఉన్న వారు అది తీవ్రం కాకముందే ఈ శిబిరం ద్వారా వైద్య సహాయం పొందుతున్నారని చెప్పారు. బాధితులకు ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేస్తూ, వేగవంతంగా సకాలంలో వైద్య సహాయం అందేందుకు తోడ్పడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు స్ఫూర్తితో నిర్వహించామని పేర్కొన్నారు. తక్కెళ్లపాడు నుంచి ప్రత్యేక బస్సు ద్వారా శ్రద్ధగా పేషెంట్లను బజరంగ్ బృందం ఆస్పత్రికి చేర్చడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు జిల్లా ప్రాజెక్టు ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు గుంటూరు జిల్లా టీం ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ శుక్రవారం తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లాలో ఈనెల 28, 29వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు ప్రతిభ చాటినట్లు చెప్పారు. మంగళగిరిలోని సీకేజీఆర్‌సీ పాఠశాలకు చెందిన విద్యార్థులు మహాలక్ష్మి, ఎస్.నాగచైతన్య తయారు చేసిన మల్టీపర్పస్ వీల్‌చైర్ ప్రాజెక్టు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు వివరించారు. విద్యార్థులతో పాటు గైడ్ టీచర్ బి. టైటాస్‌ను అభినందించారు.

పంట పండించే రైతన్న దేవుడితో సమానం

- జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్
- కంది సాగు, సేకరణపై అవగాహన
- కంది మద్దతు ధర రూ.7,500లు



కంది పంటను పరిశీలిస్తున్న జేసీ శ్యామ్‌ప్రసాద్, డీఏఓ మురళి

నరసరావుపేట రూరల్: పంటలు పండించే రైతులు దేవుడితో సమానమని జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. మండలంలోని పెదరెడ్డిపాలెంలో శుక్రవారం కంది పంటలో యాజమాన్యం, కందుల సేకరణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా కంది పంట పొలాలను ఆయన పరిశీలించారు. సాగులో ఉన్న సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో గత ఏడాది కంది పంటను 16 వేల హెక్టార్లు కాగా ఈ ఏడాది 21 వేల హెక్టార్లలో సాగుచేసినట్టు తెలిపారు.

సరాసరి ఎకరానికి 8–12 క్వింటాళ్లు దిగుబడిని సాధిస్తున్నట్టు తెలిపారు. దిగుబడిని పెంచడం ద్వారా రైతులు రాష్ట్రానికి ఎంతో మేలు చేస్తున్నారని వివరించారు. పంట సాగులో ఉన్న సమస్యలతో పాటు అధిక లాభాలు ఇస్తున్న కమర్షియల్ పంటల సాగువైపు రైతులు దృష్టిపెట్టడంతో కంది సాగు తగ్గిందన్నారు. దీనివల్ల రాష్ట్రానికి అవసరమైన కందిపప్పును ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుందన్నారు. ఈ ఏడాది సాగర్ నీటిపై రైతులు ఆశలు పెట్టుకోవద్దని స్పష్టం చేశారు. ప్రస్తుతం సాగర్‌లో ఉన్న నీరు తాగునీటి అవసరాలకు సరిపడానే ఉందన్నారు. బావులు, బోర్లను వినియోగించుకుని పంటలను సాగు చేసుకోవాలని తెలిపారు. కందిపంటను సివిల్ సప్లయ్ శాఖ ద్వారా కొనుగోలు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.7,500గా నిర్ణయించినట్టు వివరించారు. దీంతో పాటు గోనె సంచులు, లేబర్, రవాణా ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఆర్‌బీకేల వద్ద గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని, వాటిని ఉపయోగించుకుని ఆర్‌బీకేల్లో అందజేయాలని సూచించారు. కంది సేకరణ పూర్తిచేసిన వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, సీనియర్ సైంటిస్ట్ రమేష్, డీడీఏ ఎం.శివకుమారి, ఏడీఏలు మస్తానమ్మ, మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్ర బాబు, ఏఈఓలు బ్రహ్మయ్య, గ్రామ వ్యవసాయ సహాయకుడు పి.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

సూర్యమండల సాగు ఎంతో మేలు

- ఈ విధానంతో చక్కటి వ్యాయామం- ఆరోగ్యం
- ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్ కె.అమల కుమారి
- అనాధాశ్రమంలో మోడల్ సాగుకు శ్రీకారం



సూర్యమండలం సాగు ప్రయోజనాలను వివరిస్తున్న డీపీఎం అమలకుమారి

యడ్లపాడు: ప్రకృతి వ్యవసాయం విధానంలో సూర్యమండలం మోడల్ సాగువల్ల ఆరోగ్యంతో పాటు ఆదాయం, ఆహ్లాదం, వ్యాయామం అన్నీ సమకూడి సంతోషంగా ఉండవచ్చునని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి సూచించారు. మండల పరిధిలోని సంగంగోపాలపురం గ్రామంలోని బాస్ (అనాథ ఆశ్రమం)ను ఆమె సందర్శించారు. ఆశ్రమంలోని ఖాళీ స్థలంలో సూర్య మండలం మోడల్ ప్రకృతి సాగుపై వారికి అవగాహన కల్పించి వివిధ రకాల మొక్కల్ని నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూర్యునికి ఉన్న ఏడు చక్రాలు మడులుగా చేసి ఆయా మడుల్లో ఆకుకూరలు, కూరగాయలు, తీగ, దుంప, పండ్లు తదితర అన్ని రకాల మొక్కల్ని సాగు చేయడమే సూర్యమండలం మోడల్ అన్నారు. ఇంటి పెరటి, పాఠశాలలు, వసతి గృహాల్లోని ఖాళీ ప్రదేశాలన్నింటిలోనూ ఈ విధానం సాగుకు ఘన, జీవామృతా వినియోగిస్తే 365 రోజులు రసాయన అవశేషాల్లేని నాణ్యమైన ఉత్పత్తిని సాధించవచ్చన్నారు. ప్రతిరోజు ఓ కొత్త కూరను రుచి చూసే అవకాశం ఉంటుందన్నారు. విధానం సాగులో కుటుంబ సభ్యులు, పిల్లలు, విద్యార్థులు భాగస్వామ్యం కావడంతో ఇళ్లల్లోని కుటుంబ సభ్యులు, అలాగే పాఠశాల, వసతి గృహాల్లో విద్యార్థులకు మంచి వ్యాయామం, ఆరోగ్యం, వాటిని అమ్ముకుంటే ఆదాయం పొందొచ్చని విషయాన్ని గ్రహించాలన్నారు. తద్వారా సంతోష జీవాన్ని సాగించే వీలుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌డీ హెల్త్, న్యూట్రిషన్ ఎం శివాని, డీఎంఎం టి.నరసింహారావు, ఐసీఆర్పీ ఆకుల సుభాషిణి, భారత అభ్యుదయ సేవా సమితి వసతి గృహం మేనేజర్ జోసెఫ్ ఆంథోని పాల్గొన్నారు.

అనాటమీ డి సెక్షన్ హాలు ఆధునికీకరణ

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల 1998 బ్యాచ్‌కు చెందిన వైద్య విద్యార్థి డాక్టర్ బేతపూడి గిరిధర్‌రాజా రూ.10 లక్షలు విరాళం అందించడంతో వైద్య కళాశాలలో అనాటమీ డి సెక్షన్ హాలును ఆధునికీకరించి స్మార్ట్ బోర్డు ఏర్పాటు చేశారు. డాక్టర్ గిరిధర్‌రాజా తల్లిదండ్రులు బేతపూడి జోసెఫ్ స్టాన్లీ, హేమలత దంపతుల జ్ఞాపకార్థం అనాటమీ డిసెక్షన్ హాలు ఆధునికీకరణకు విరాళం అందజేసినట్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి తెలిపారు. శుక్రవారం హాలును డాక్టర్ బేతపూడి గిరిధర్‌రాజాతో కలసి ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో అనాటమీ ప్రొఫెసర్ డాక్టర్ సావిత్రి, వైస్ ప్రిన్సిపాల్‌స డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ సుబ్బారావు పాల్గొన్నారు.